

# నాయుడుపేట ఏఎంసీ కార్యదర్శిగా గుణశేఖర్

**నాయుడుపేట, పెన్ పవర్, ఆగష్టు 17**

నాయుడుపేట అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా గుణశేఖర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్యదర్శి గుణశేఖర్ ఏఎంసి చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ కు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ మాట్లాడుతూ నూతన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన గుణశేఖర్ ఏం సి కార్యాలయ సిబ్బంది సహకారంతో ఏఎంసి అభివృద్ధికి తన వంతు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు,కార్తీక్,తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

# 335 పిటిషన్లతో మెగా డీఎస్సీని అడ్డుకునే కుట్ర

## - నిరుద్యోగులపై వైకాపా కుట్రలను అసెంబ్లీలో ఎండగట్టిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

- **కేవలం 148 రోజుల్లోనే 16,347 పోస్టుల భర్తీ ఒక చారిత్రాత్మక విజయం**
- **వైకాపా హయాంలో తెచ్చిన జీవోల ప్రకారమే స్పోర్ట్స్ కోటా భర్తీ.. అవగాహన లేకుంటే ఎలా**
- **కోవూరులో నిరసనలకు స్థానికుల స్పందన కరవు.. పక్క నియోజకవర్గం నుంచి జనాలను తరలించారు**
- **అసెంబ్లీకి వచ్చి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో చర్చించే ధైర్యం వైకాపాకు ఉందా**



**కోవూరు పెన్ పవర్ ఆగస్టు 17.**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి సంతకంతోనే మెగా డీఎస్సీకి శ్రీకారం చుట్టారని, కేవలం 148 రోజుల్లోనే 16,347 ఉపాధ్యాయ పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. ఉద్యోగాల భర్తీని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న నిరసనలు రాజకీయ లబ్ధి కోసం చేస్తున్నవేనని, వాస్తవానికి అవి నిరుద్యోగ యువతకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటాలని స్పష్టం చేశారు. సోమవారం ప్రారంభమైన అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తొలిరోజు మెగా డీఎస్సీ అంశంపై ప్రశాంతి రెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్ల కోసం యువత ఎదురుచూసే పరిస్థితి ఉండేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నోటిఫికేషన్ ఇచ్చి, ప్రక్రియను పూర్తి చేసి ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు.

**స్పోర్ట్స్ కోటా నియామకాల్లో ఎక్కడా పొరపాటు జరగలేదు**

2011 నుంచి ఎన్‌సీఈఆర్టీ నిబంధనల ప్రకారం, టెట్‌లో అర్హత సాధించిన వారు మాత్రమే డీఎస్సీ రాసేందుకు అర్హులని ఎమ్మెల్యే తెలిపారు. నేటి ఉపాధ్యాయులు టెట్‌తో పాటు డీఎస్సీ పరీక్ష రాసి మెరిట్ ఆధారంగా ఎంపికైనవారన్నారు. 2022 తర్వాత కేంద్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో విధానాన్ని తీసుకురాగా, 2023లో అప్పటి వైసీపీ ప్రభుత్వం జీవో నంబర్ 77ను 2023 ఆగస్టు 2న జారీ చేసిందన్నారు. దీంతో స్పోర్ట్స్ కోటాలో గతంలో ఉన్న వర్టికల్ రిజర్వేషన్‌కు బదులుగా హారిజాంటల్ రిజర్వేషన్ విధానం అమల్లోకి వచ్చిందని వివరించారు. అదే విధానాన్ని ప్రస్తుత డీఎస్సీలో కూడా అమలు చేశారని, గత పాలకులు తీసుకొచ్చిన జీవో ప్రకారమే నియామకాలు జరిగాయని స్పష్టం చేశారు. వాస్తవాలు తెలియకుండా నిందలు వేయడం అర్హులైన అభ్యర్థులను అవమానించడమేనన్నారు.

ఉద్యోగాలు ఇవ్వని ప్రభుత్వం 'క్రెడిట్ చోరీ' అంటోంది

ఐదేళ్లలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని ప్రభుత్వం నుంచి కూటమి ప్రభుత్వం ఏం క్రెడిట్ చోరీ చేయాలో అర్థం కావడం లేదని ప్రశాంతి రెడ్డి ప్రశ్నించారు. మెగా డీఎస్సీపై వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీ ఒకరు కోర్టులో పిటిషన్ వేయడం మరింత విచిత్రమని అన్నారు. ఆయన ఎన్నికైందే ఉపాధ్యాయుల ఓట్లతో అని గుర్తు చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రాకుండా అడ్డుకునేందుకు ఏకంగా 335 పిటిషన్లు వేయించి, కోర్టుల ద్వారా మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. 'ఇది ఎవరి మీద పోరాటం? చంద్రబాబు పైనా కాదు... లోకేష్ పైనా కాదు... కూటమి ప్రభుత్వంపైనా కాదు... ఉద్యోగం కోసం రాత్రింబగళ్లు చదువుకున్న నిరుద్యోగ యువతపై పోరాటం' అని ఎమ్మెల్యే అన్నారు.

**కోవూరులో ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయుల అవసరం ఉంది**

కోవూరు నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల అవసరం స్పష్టంగా కనిపిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. దామరమడుగు, పోతిరెడ్డిపాళెం, ఊటుకూరు, నార్త్‌రాజుపాళెం, ఇందుకూరుపేట వంటి గ్రామాల్లోని పాఠశాలల్లో వివిధ సబ్జెక్టులకు ఉపాధ్యాయుల అవసరం ఉందన్నారు. ఒక టీచర్ పోస్టు భర్తీ అయితే ఒక నిరుద్యోగ యువకుడికి ఉద్యోగం వస్తుందని, అదే సమయంలో ఒక తరగతి గదిలోని పిల్లలకు మంచి ఉపాధ్యాయుడు అందుతారని చెప్పారు. ఈ వాస్తవాన్ని కూడా అర్థం చేసుకోకుండా కోవూరు నియోజకవర్గంలో నిరసనలు చేయడం సరికాదన్నారు. నిరసనలకు స్థానికుల నుంచి స్పందన లేకపోవడంతో పక్కనే ఉన్న గూడూరు నియోజకవర్గం నుంచి జనాలను తరలించాల్సిన పరిస్థితి వచ్చిందని, ప్రజలు మాత్రం ఇలాంటి రాజకీయ నిరసనలకు సహకరించడం లేదన్నారు. రెండు ప్రభుత్వాల మధ్య ఉన్న తేడా ప్రజలకు స్పష్టంగా అర్థమవుతోందని తెలిపారు.

**ప్రభుత్వ విద్యలో వచ్చిన మార్పు కళ్లముందే కనిపిస్తోంది**

తాను 2016 నుంచి నెల్లూరులో వీపీఆర్ విద్య స్కూల్ నిర్వహిస్తున్నానని, అక్కడ విద్యార్థులకు అన్నీ ఉచితంగా అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఒకప్పుడు ఒక తరగతిలో 32 సీట్ల కోసం 300 వరకు దరఖాస్తులు వచ్చేవని, ఇప్పుడు ఆ సంఖ్య 120 వరకు పడిపోయిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు అద్భుతంగా ఉండటం వల్లే ఈ మార్పు వచ్చిందని తెలిపారు. నెల్లూరులో మంత్రి నారాయణ అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాఠశాలల ముందు కూడా 'నో అడ్మిషన్' బోర్డులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యారంగంలో ఇంతటి అభివృద్ధి జరుగుతుంటే, దానిపై ర్యాలీలు, ప్రదర్శనల పేరుతో బురదజల్లే ప్రయత్నాలు చేయడం అనవసరమని విమర్శించారు.

**పారదర్శకతే కూటమి ప్రభుత్వ బలం**

కూటమి ప్రభుత్వానికి పారదర్శకతే బలం, ప్రజల విశ్వాసమే పెట్టుబడి అని ప్రశాంతి రెడ్డి అన్నారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ నుంచి మెరిట్ లిస్టులు, ఆన్సర్ కీలు, గ్రీవెన్స్ పరిష్కార విధానం, ఎంపిక ప్రక్రియ వరకు అన్ని వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. ఐదేళ్ల పాలనలో 'జాబ్ క్యాలెండర్' పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేసిన గత ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వం కేవలం 148 రోజుల్లోనే 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంతో జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. వైఎస్ఆర్‌సీపీకి నిజంగా ఎవరికైనా మేలు చేయాలనే ఉద్దేశం ఉంటే, చేతనైతే అసెంబ్లీకి వచ్చి విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ తో చర్చలో పాల్గొనాలని ప్రశాంతి రెడ్డి సూచించారు.

# "నంద్యాల ప్రజలతో మమేకమవుతున్న టీడీపీ.. ఇంటింటికీ చేరుతున్న సంక్షేమ పథకాలు ఎన్.ఎం.డి ఫిరోజ్"

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 17**

నంద్యాల: ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా నంద్యాల నియోజకవర్గంలోని 18వ వార్డు ఎన్జీఓస్ కాలనీలో వార్డు నాయకులు శ్రీకాంత్ నాయుడు & తోట రామయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన డోర్ టు డోర్ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.ఎం.డి ఫిరోజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్.ఎం.డి ఫిరోజ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరుతున్నాయని తెలిపారు. కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మంది పిల్లలకు 'తల్లికి వందనం' పథకం ద్వారా ఆర్థిక సహాయం అందుతోందన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పెంచి లబ్ధిదారుల ఇంటికే వెళ్లి అందిస్తున్నామని, అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత గ్యాస్ సబ్సిడీ, రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు అందుతున్నాయని, స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని వివరించారు. రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టుబడులను పెద్ద ఎత్తున ఆకర్షిస్తున్నామని, దేశవిదేశీ పెట్టుబడిదారులు ముందుకు వస్తున్న నేపథ్యంలో



భవిష్యత్తులో లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ఏ వార్డుకు, ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు చూపిస్తున్న ఆత్మీయత, ఆదరణ ప్రభుత్వంపై ఉన్న నమ్మకానికి నిదర్శనం" అని ఎన్.ఎం.డి ఫిరోజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు,రాంపల్లి రామిరెడ్డి బొట్టు వెంకటేష్ కృష్ణమాచార్యులు లింగారెడ్డి దామోదర్ సత్తార్ తిరుపాల్ దామోదర్ కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ గోవిందా నాయుడు, ఉప్పరి సురేష్ కుమార్, షేక్ అజ్మీర్, హీదాయతుల్లా ఖాన్, ఖాజా ,కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# నాయుడుపేట కోర్టు లో

## న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన




**నాయుడుపేట, పెన్ పవర్, ఆగష్టు 17**

నాయుడుపేట కోర్టులో సోమవారం న్యాయవాదులు విధులకు బహిష్కరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు పసల చెంగయ్య మాట్లాడుతూ ఇటీవల అనంతపురంలో ఒక న్యాయవాదిపై పోలీసులు దురుసుగా ప్రవర్తించి, అసభ్యకరంగా మాట్లాడడాన్ని ఆయన ఖండించారు. న్యాయవాదిపై దురుసుగా ప్రవర్తించిన పోలీస్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే అడ్వకేట్ ప్రొటెక్షన్ చట్టాన్ని ప్రభుత్వం అమలు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



# మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**నాయుడుపేట, పెన్ పవర్, ఆగష్టు 17**

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారంఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నాయుడుపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గాంధీ పార్క్ వద్ద మున్సిపల్ కార్మికులు మానవహారం నిర్వహించారు. మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న పర్మినెంట్, కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ కార్మికులు,ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి టి. సుబ్రహ్మణ్యం,ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డిపల్లి చెంగయ్య, నాయుడుపేట సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.ముకుంద తదితరులు పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు ఎండ,వర్షం, పండుగలు,సెలవులు అనే తేడా లేకుండా పట్టణ ప్రజలకు పారిశుధ్యం,చెత్త సేకరణ, డ్రైనేజీ నిర్వహణ తదితర అత్యవసర సేవలను అందిస్తున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్యం,పట్టణ పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. మున్సిపల్ రంగంలో ప్రైవేటీకరణను పూర్తిగా ఉపసంహరించాలని,కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని,సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న వేతనాలు, బకాయిలను



వెంటనే చెల్లించాలని కోరారు. మున్సిపల్ ఉద్యోగులు,కార్మికుల వేతనాలు, సేవా పరిస్థితులను మెరుగుపరిచేందుకు 12వ పే రివిజన్ కమిషన్ (పి ఆర్ సి )ను వెంటనే ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు గ్లౌజులు, మాస్కులు,బూట్లు,యూనిఫాం, ఇతర రక్షణ పరికరాలను క్రమం తప్పకుండా అందించాలని కోరారు. మున్సిపల్ కార్మికుల ప్రధాన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి,రాష్ట్ర అసెంబ్లీలో చర్చించి పరిష్కారానికి స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు,సీఐటీయూ నాయకులు,ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు శ్రీనివాసులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాంతకంగా మారిన కేబుల్ కనెక్షన్ గుంతలు



**శిరివెళ్ల పెన్ పవర్ ఆగస్ట్ 17**

నంద్యాల జిల్లా శిరివెళ్ల మండల కేంద్రంలోని శిరివెళ్ల మేజర్ గ్రామపంచాయతీలో తీసినటువంటి కేబుల్ గుంతలు ప్రాణాంతకంగా మారాయి. వారాల తరబడి తీసిన గోతులు పూడ్చకపోవడం వల్ల పలువురు ప్రమాదాలకు గురి అవుతూ ప్రాణాపాయ పరిస్థితి ఎదుర్కొంటున్నారు. శిరివెళ్ల మండల కేంద్రంలోని ముల్లాపేటకు షారుక్ అను యువకుడు కేబుల్ కాంట్రాక్టర్లు సిబ్బంది తీసిన గోతిలో పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించడంతో అక్కడ 24 గంటలు కావస్తున్న ఇంకా కోమాలోనే ఉన్నారని స్పృహలో లేకపోవడంతో బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. షారుక్ కు ఇటీవల రెండు నెలల క్రితం వివాహం జరిగిందని ఇంకా పూర్తిస్థాయిలో పెళ్లి వేడుకలు ముగియకముందే కేబుల్ గుంతలు పెను శాపంగా మారిపోయినట్లు శిరివెళ్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శిరివెళ్ల మేజర్ గ్రామపంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి కేబుల్ గుంతలను సకాలంలో పూడిపించే విధంగా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో మరిన్ని ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని గ్రామస్తులు తెలియజేశారు.

# తిరుపతి నుంచి మరో రాజకీయ పార్టీ ఆవిర్భావం

- 'నవనిర్మాణ రాజ్యం' పేరుతో ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధం
- అవినీతి, అక్రమాలపై ఉద్యమమే లక్ష్యమంటున్న నాయకులు
- యువత, మహిళలు, రైతులు, కార్మికులకు ప్రాధాన్యం

**తిరుపతి, పెన్ పవర్, ఆగస్టు 17:**

తిరుపతి కేంద్రంగా 'నవనిర్మాణ రాజ్యం' పేరుతో మరో కొత్త రాజకీయ పార్టీ ప్రజల ముందుకు రాబోతోంది. సమాజంలో పెరుగుతున్న అవినీతి, అక్రమాలు, అన్యాయం, అధికార దుర్వినియోగంపై పోరాటం చేయడంతో పాటు ప్రజలకు పారదర్శకమైన, మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతో పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు నాయకులు వెల్లడించారు. ప్రజల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ సామాన్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడం తమ ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. ముఖ్యంగా యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యం కల్పించడంతో పాటు మహిళలు, రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. రాజకీయాలను స్వప్రయోజనాలకు వేదికగా కాకుండా ప్రజాసేవకు వేదికగా మార్చడమే 'నవనిర్మాణ రాజ్యం' లక్ష్యమని నాయకులు స్పష్టం చేశారు. అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగం వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు ప్రజల భాగస్వామ్యంతో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. త్వరలో తిరుపతి నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా పార్టీ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలతో నేరుగా మమేకమై స్థానికంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం అవసరమైన ఉద్యమాలు



చేపడతామని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, సమానత్వం, నిజాయితీతో కూడిన రాజకీయ వ్యవస్థ నిర్మాణం కోసం ప్రజలు తమతో కలిసి రావాలని 'నవనిర్మాణ రాజ్యం' నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం. వెంకటరమణ, మోహన్, బాబు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు

# గంగవరం విద్యార్థులు





**పలమనేరు,పెన్ పవర్,ఆగస్టు 17,**

రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు గంగవరం విద్యార్థులు ఎంపికైనట్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెంగల్ రెడ్డి అన్నారు. తిరుపతిలో ఈనెల 24 నుండీ 27వతేదీ వరకూ రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్ బాస్కెట్ బాల్ పోటీలకు పాఠశాలకు చెందిన విద్యార్థులు రాగవి,సపూరా చిత్తూరులో జరిగిన పోటీలలో ఎంపిక చేశారని అన్నారు. ఈ విద్యార్థులు జిల్లా నుండి రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని ఈసందర్భంగా పాఠశాల పి.డిలు రమణ,అజీమ్ మరియు ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

# నీటి భద్రతే రైతు భవిష్యత్తు..

## ఎల్‌నినోను ఎదుర్కొనేలా ప్రణాళికలు అవసరం

- అసెంబ్లీ వేదికగా ముందస్తు సాగునీటి నిర్వహణపై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి
- సోమశిల జలాల లభ్యత ఆధారంగా చివరి ఆయకట్టు వరకు నీరందేలా స్పష్టమైన షెడ్యూల్ ఇవ్వాలి
- ఆక్వా, ఉద్యానవన రైతులకు వాతావరణ మార్పులపై శాస్త్రీయ సూచనలు అందించాలి
- నీటి సంఘాల పునరుద్ధరణతో వృథా అరికట్టి ప్రతి బొట్టునూ సద్వినియోగం చేస్తున్నాం
- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న ముందస్తు చర్యలకు ధన్యవాదాలు

**నెల్లూరు పెన్ పవర్ ఆగస్టు 17.**



రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, నీటి భద్రత ఉంటేనే రైతు భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం శాసనసభ సమావేశాల్లో భాగంగా ఆమె వ్యవసాయం, సాగునీటి యాజమాన్యం, ఎల్‌నినో ప్రభావంపై మాట్లాడారు. కోవూరు నియోజకవర్గం ప్రధానంగా పెన్నా నది, సోమశిల జలాలు, తాగునీటి కాలువలపై ఆధారపడిన వ్యవసాయ ప్రాంతమని గుర్తుచేశారు. వరిసాగుతో పాటు ఆక్వా, ఉద్యానవన పంటలు కూడా రైతులకు ప్రధాన జీవనాధారంగా ఉన్నాయని తెలిపారు.

**ఎల్‌నినోను ఎదుర్కొనేలా ముందస్తు కార్యాచరణ అవసరం**

వర్షపాతం తగ్గినా, వర్షాలు ఆలస్యమైనా, ఉష్ణోగ్రతలు పెరిగినా మొదటి ప్రభావం రైతులపైనే పడుతుందని వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. వర్షాలు వచ్చిన తర్వాత చర్యలు తీసుకోవడం కాకుండా, రాకముందే నియోజకవర్గం నుంచి జిల్లా స్థాయి వరకు ముందస్తు కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు. సోమశిల జలాల లభ్యత ఆధారంగా ముందస్తు సాగునీటి ప్రణాళికలు రూపొందించి, పెన్నా నదిలో నీటి లభ్యతను బట్టి స్పష్టమైన సాగునీటి షెడ్యూలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కాలువల్లో అవసరమైన మరమ్మతులు చేపట్టి చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా చూడాలని సభ దృష్టికి తీసుకెళ్లారు.

**రైతులకు ప్రత్యామ్నాయ సూచనలు, శాస్త్రీయ సమాచారం**

వర్షాలు ఆలస్యమయ్యే పరిస్థితుల్లో రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై ముందస్తు సూచనలు ఇవ్వాలని ప్రశాంతి రెడ్డి కోరారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని ఆక్వా రైతులకు శాస్త్రీయ సూచనలు, వాతావరణ సమాచారం అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామాల్లో తాగునీటి అవసరాలను ముందుగానే అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో అనేది కేవలం వాతావరణ సమస్య కాదని, ఇది రైతు ఆదాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, ఆహార భద్రతతో పాటు నీటి వనరులు, తాగునీరు, పశుసంవర్ధక, విద్యుత్ వంటి అనేక శాఖలతో ముడిపడి ఉన్న అంశమని స్పష్టం చేశారు.

**నీటి సంఘాల పునరుద్ధరణతో సత్ఫలితాలు**

గత ప్రభుత్వంలో నిర్వీర్యమైపోయిన నీటి సంఘాలను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించడం వల్ల ఎంతో మంచి జరిగిందని వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కొనియాడారు. జిల్లా కలెక్టర్, జిల్లా మంత్రులు, ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల అధ్యక్షులు, డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్లు కలిసి నీటిని పొదుపుగా వాడేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని తెలిపారు. తమ కోవూరు నియోజకవర్గంలో చివరి ఆయకట్టు వరకు నీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఉద్యానవన పంటలను కాపాడుకోవడానికి అధికారులతో నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

**రైతాంగం నష్టపోకుండా సీఎం చొరవ**

ప్రభుత్వ ప్రాజెక్టుల్లో నీరు వృథా కాకుండా ప్రతి బొట్టునూ సద్వినియోగం చేస్తూనే, భవిష్యత్ అవసరాల కోసం నీటిని నిల్వ ఉంచడం బాధ్యతాయుతమైన రైతు ప్రభుత్వానికి నిదర్శనమని ప్రశాంతి రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయ శాఖ మంత్రికి ప్రశాంతి రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ ట్రాక్టర్ డ్రైవర్ మృతి

- మృతదేహానికి నివాళులర్పించిన చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళి
- కుటుంబానికి ఎత్తుబడి ఖర్చుల నిమిత్తం మున్సిపాలిటీ తరపున ఆర్థిక సహాయం



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 17.**

బుచ్చిరెడ్డిపాలెం: బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ శానిటేషన్ విభాగంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇనకర్ల శ్రీనివాసులు రోడ్డు ప్రమాదంలో ఆకస్మికంగా మృతి చెందడం పట్ల బుచ్చిరెడ్డిపాలెం మున్సిపల్ చైర్‌పర్సన్‌మోర్ల సుప్రజా మురళి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.సంగం మండలం తరుణవాయిరాంపూ మధ్య జాతీయ రహదారిపై నిన్న జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనివాసులు మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళి ముదివర్తి గ్రామానికి చేరుకుని శ్రీనివాసుల భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు..అనంతరం బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ తరఫున శ్రీనివాసుల కుటుంబానికి ఎత్తుబడి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఇనమల చినబాబు, వైస్ చైర్మన్ ఎరటపల్లి వెంకట శివ కుమార్ రెడ్డి మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, పాల్గొని శ్రీనివాసులకు నివాళులర్పించారు..

# కలెక్టర్ రాజకుమారి గణియా గారిని మర్యాదపూర్వకంగా కలిసిన నంద్యాల జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ దండే వెంకట నరేష్



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 17**

నంద్యాల జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నంద్యాల జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా వారిని మర్యాద పూర్వకంగా కలిశారుఈ సందర్భంగా జిల్లాలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ( సి.డబ్ల్యూ.సి) పనితీరు, పిల్లల సంరక్షణ, రక్షణ, పునరావాసం, విద్య, భద్రత తదితర అంశాలపై చర్చించారు. ముఖ్యంగా జూవేనీలే జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ అఫ్ చిల్డ్రన్ ) యాక్ట్ పరిధిలో పిల్లల సంక్షేమం కోసం చేపట్టాల్సిన చర్యలు, సంబంధిత శాఖల మధ్య సమన్వయం, పిల్లలకు అందాల్సిన రక్షణ మరియు పునరావాస సేవలపై తెలియజేశారు. బాలల హక్కుల పరిరక్షణలో జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ, డి సి పి యు , చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ తదితర విభాగాల సమన్వయం ఎంతైనా అవసరమని తెలిపారు.చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించిన బాధ్యతలను చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా, పిల్లల ఉత్తమ ప్రయోజనాలను (బెస్ట్ ఇంటరెస్ట్ అఫ్ చైల్డ్ ) ప్రధానంగా తీసుకుని నిర్వహించేందుకు కృషి చేస్తానని చైర్‌పర్సన్ దండే వెంకట నరేష్ జిల్లా కలెక్టర్ కి తెలిపారు.జిల్లాలో సంరక్షణ మరియు రక్షణ అవసరమైన ప్రతి చిన్నారికి అవసరమైన సహాయం, భద్రత, విద్య, కౌన్సెలింగ్, పునరావాసం వంటి సేవలు సమర్థవంతంగా అందేలా సంబంధిత శాఖలతో సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వం మరియు సహకారం కోరినట్లు చైర్‌పర్సన్ తెలిపారు.

# రైతాంగ సమస్యలు పరిష్కరించాలని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

## - ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన ఏపీ రైతు సంఘం, ఏఐకేఎస్, సీపీఐ నాయకులు

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, సూళ్లూరుపేట, ఆగస్టు 17:**

రైతాంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఏఐకేఎస్, భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో సోమవారం సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం రైతుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవోకు అందజేశారు.




ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు ఇలప నాగేంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వాలు రైతాంగ సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని విమర్శించారు.సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో అనేక రైతాంగ సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయని తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగ మండలం వీఎస్‌పురంలో సాగు చేస్తున్న రైతులకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తెలుగు గంగ పరిధిలో అసంపూర్తిగా ఉన్న కాలువలను పూర్తి చేయడంతో పాటు ఆక్రమణలకు గురైన పంట కాలువలను గుర్తించి పునరుద్ధరించాలని కోరారు.నకిలీ విత్తనాల కారణంగా సుమారు 1,500 ఎకరాల్లో పంట నష్టపోయి, దాదాపు రూ.3 కోట్ల మేర రైతులు నష్టపోయారని నాయకులు పేర్కొన్నారు. నష్టపోయిన రైతులకు ఇప్పటికీ తగిన పరిహారం అందలేదని, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు స్పందించి బాధిత రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే ఆక్రమణలకు గురైన నెర్రి కాలువ తన సహజ స్వరూపాన్ని కోల్పోయిందని ఆరోపించారు. సాగునీరు ప్రవహించాల్సిన కాలువలో మురుగునీరు ప్రవహిస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాలువ ఆక్రమణలను తొలగించి, పూడికను తొలగించి, సాగునీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.రైతుల సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రమణయ్య, శ్రీనివాసులు, ఆనంద్‌బాబు, ఓ.కుమార్, బాలు, రజిని, చంచమ్మ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయరా ?




**పలమనేరు,పెన్ పవర్,ఆగస్టు 17,**

2024 ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయరా అని నియోజకవర్గ ఎస్.డి.పి.ఐ. అధ్యక్షులు ముబారక్ సూటిగా ప్రశ్నించారు. సోమవారం ఈమేరకు డిమాండ్ చేస్తూ పట్టణంలోని క్లాక్ టవర్ వద్ద ధర్నా నిర్వహించారు.కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వం అధికారంలో వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న గాని హామీల అమల్లోకి రాకపోవడం చాలా బాధాకరమన్నారు.ఆడబిడ్డ నిధి,19 నుండి 59 సంవత్సరాల మహిళలకు నెలకు రూ.1500 ఎన్నాళ్లకు వస్తుందని,యువగళం కింద 20 లక్షల ఉద్యోగాలు,నెలకు రూ.3000 నిరుద్యోగ భృతి అందేది ఎప్పుడన్నారు. బీసీలకు రూ.1.5లక్షల కోట్ల ప్రత్యేక సబ్ ప్లాన్ ఎక్కడ అన్నారు.ముస్లింలకు ఇమామ్,మౌజన్ ల గౌరవ వేతనాలు నెలల తరబడి పెండింగ్ లో ఉన్నాయని,హాజ్ యాత్రికులకు 1లక్ష సబ్సిడీ, విజయవాడ హజ్ హౌస్ నిర్మాణం, ఈద్గా,కబ్రస్తాన్ స్థలాల కేటాయింపు,ముస్లిం మైనారిటీలకు 50 సంవత్సరాలకే పెన్షన్,మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రూ.5లక్షల వరకు వడ్డీ లేని రుణాలు,వక్ఫ్ ఆస్తుల సంరక్షణ,దుల్హన్ పథకం పునరుద్ధరణఇవన్నీ కేవలం ఎన్నికల వాగ్దానాలేనా అని ప్రశ్నించారు.ప్రభుత్వం వెంటనే స్పందించి పైన తెలిపిన హామీలను అమలు చేయాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈ ధర్నాలో పార్టీ కార్యదర్శి మహబూబ్, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోడీ, కూటమి ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ సమరశంఖం

- మోడీ పాలనలో రైతన్నల ఆత్మహత్యలు, పేపర్ లీకేజీలే మోడీ, కూటమి ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ సమరశంఖం
- సెప్టెంబర్ 1న ఢిల్లీలో రామ్ లీల మైదానంలో ప్రజా యుద్ధభేరికి తరలిరండి
- నంద్యాల జిల్లా అభివృద్ధికి రూ.25,000 కోట్లు కేటాయించాలి!
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 17**

నంద్యాల పట్టణంలో అర్హులయినా నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికో లేదు కానీ మంత్రి ఫరూక్ టిడిపి ఆఫీస్ రెండు ఎకరాల స్థలం ఎందుకు?

సిపిఐ ఆధ్వర్యంలో జరిగిన నంద్యాల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో మంత్రి ఫరూక్ ను ప్రశ్నించిన

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. రామాంజినేయులు

పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, నంద్యాల పట్టణాన్ని అభివృద్ధి చేయకపోతే ఎమ్మెల్యే, ఎంపీ, ల ఇల్లు ముట్టడిస్తాం

సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు హెచ్చరిక

జిల్లా వ్యాప్తంగా అన్ని రంగాల కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకపోతే ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలకు సిద్ధం అవుతాం



కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ సీపీఐ నంద్యాల జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా, హోరెత్తే వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.రామాంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు నేతృత్వంలో పట్టణంలోని సీపీఐ కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు వేలాది మందితో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణాన్ని ముట్టడించి, ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కలెక్టరేట్ ప్రత్యేక అధికారికి వినతిపత్రం అందజేశారు.ఆగస్టు 6 నుండి 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాలోని అన్ని గ్రామాల్లో, వార్డులలో ప్రచారం నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకున్నామని, 'మార్పు రావాలి ప్రజా సమస్యలు తీరాలి' అనే నినాదంతో పాలకవర్గాల తీరును ఎండగట్టేందుకు ఈ పోరాటానికి శ్రీకారం చుట్టామని నాయకులు తెలిపారు.ధర్నాను ఉద్దేశించి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ.. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. నంద్యాల జిల్లాకు చెందిన మంత్రులు ఎన్.ఎమ్.డి. ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి జిల్లా ప్రాజెక్టులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. 2017లో వరదలకు గండిపడిన అలగనూరు రిజర్వాయర్‌కు ఇంతవరకు మరమ్మతులు చేయకపోవడంతో నీరు వృథాగా పోతోందని, సాగు, తాగునీరు లేక ప్రజలు అల్లాడుతున్నారన్నారు. డోన్ నియోజకవర్గంలో చిన్న చిన్న ప్రాజెక్టులకు చెరువులకు మరమ్మతులు చేసి హంద్రీనీవా ద్వారా నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు.శ్రీశైలం జలాశయంలో 174 టీఎంసీల నీటి నిల్వ ఉన్నప్పటికీ, 754 అడుగుల వద్ద రాయలసీమకు నికర మిగులు జలాలు 39 టీఎంసీలు ఇవ్వకపోవడం వల్ల నంద్యాల జిల్లాలో లక్ష ఎకరాలు, కడప జిల్లాలో 90 వేల ఎకరాల్లో రైతులు వరి నాట్లు వేసుకోలేని పరిస్థితి దాపరించిందన్నారు. పోలవరం నుండి గుంటూరు జిల్లా పులిచింతల ద్వారా 860 మీటర్ల పైకి నీటిని ఎత్తి, నల్లమలలో 27 కిలోమీటర్ల సొరంగం తవ్వి, అడవులను విధ్వంసం చేస్తూ రూ. 81,000 కోట్లతో నీళ్లిస్తామని చంద్రబాబు కల్లబొల్లి మాటలు చెబుతున్నారన్నారు. జిల్లాలో ఉన్న ప్రాజెక్టులకు రూ. 100 నుండి 200 కోట్లు ఖర్చు పెట్టలేని ప్రభుత్వం, అంత పెద్ద ప్రాజెక్టుల పేరుతో రైతులను మోసం చేస్తోందని వివంతంలోని 8 జిల్లాలకు రూ. లక్ష కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో నంద్యాల జిల్లా అభివృద్ధికి రూ. 25,000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. 95% పూర్తయిన రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని అనుమతుల పేరుతో పక్కన పెట్టడం సీమ పట్ల ద్రోహమేనన్నారు.రాష్ట్రంలో ఎల్ నీనో ప్రభావంతో కరువు తాండవిస్తుంటే ముందస్తు చర్యలు తీసుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సంపద సృష్టిస్తామన్న నాయకులు ఉపాధి లేక రైతులు, కూలీలు వలసలు పోతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇంటి స్థలంతో పాటు రూ. 4 లక్షల నిర్మాణ సాయం ఏమైందని నిలదీశారు. మహిళలకు నెలకు రూ. 1,500 సాయం, నిరుద్యోగులకు రూ. 3,000 భృతి, రైతులకు రూ. 40,000 ఇస్తామని చెప్పి కేవలం రూ. 20,000 ఇచ్చి మిగిలిన మొత్తం ఎగవేశారని విమర్శించారు. జిల్లాను సీడ్ హబ్‌గా మార్చాలని, ప్యాపిలిలో జ్యూస్ ఫ్యాక్టరీ, డోన్, బనగానపల్లె ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. మహానంది మండలం అబ్బిపురం చెంచు కాలనీలో గత 40 ఏళ్లుగా దళితులు సాగు చేసుకుంటున్న 85 ఎకరాల భూమిని అగ్రవర్ణ నాయకులు ఆక్రమించేందుకు కుట్రలు చేస్తున్నారని, నందికొట్కూరు ప్రాంతంలోని 1600 ఎకరాల ప్రభుత్వ భూమిని అభివృద్ధి చేసి దళితులకు పంపిణీ చేయాలని కోరారు.

కేంద్రంలో మోడీ పాలనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ గుజ్జుల ఈశ్వరయ్య.. రైతులను కాపాడుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన మోడీ హయాంలో నేడు రోజుకు 31 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఇప్పటివరకు 4,56,000 మంది రైతులు బలికావడం దారుణమన్నారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తెచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ. 17 లక్షలు వేస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. గడిచిన 12 ఏళ్లలో 152 సార్లు పోటీ పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయని, నీట్ పేపర్ లీకేజీ వల్ల 22 మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకున్నా కేంద్రంలో చలనం లేదని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి సామాన్యుల నడుం విరిచారని, దేశ సంపదనంతా అదానీ, అంబానీలకు దోచిపెడుతూ, ప్రభుత్వ రంగాన్ని అమ్మేస్తున్నారని విమర్శించారు. కమ్యూనిస్టులను "అర్బన్ నక్సలైట్లు" అని బెదిరించాలని చూస్తే భయపడేది లేదని, మోడీ విధానాలకు నిరసనగా సెప్టెంబర్ 1న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి కే ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు. పి సుంకయ్య, రాధాకృష్ణ, రమేష్ బాబు, భార్గవ్, కె.భాస్కర్, రఘురాంమూర్తి, మోటా రాముడు, నాగ రాముడు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీదేవి, రజిత, సుశీలమ్మ, ఏఐటీయూసీ నాయకులు ధనుంజయుడు, డి శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, సిపిఐ సీనియర్ నాయకులు సంజీవులు, నరసింహులు, శివయ్య, హరినాథ్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారులు వాసు, నాగరాజు,విజయ్, రాజు, నంద్యాల జిల్లాలోని 29 మండలాల నుండి వేలాది మంది సిపిఐ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరత తీర్చాలి



**పుత్తూరు, పెన్ పవర్ ఆగస్టు 17:**

పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరతను తక్షణమే పరిష్కరించడంతో పాటు ఆసుపత్రిలో మౌలిక వసతులు మెరుగుపరచాలని కోరుతూ దళిత గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో డీఆర్ఓ జి. నరసింహులుకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై. నందయ్య మాట్లాడుతూ పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని కోరారు. ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన వైద్య సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా గైనకాలజిస్ట్ డాక్టర్‌ను నియమించాలని, గొల్లపల్లి పీహెచ్‌సీకి సొంత భవనం ఏర్పాటు చేయాలని కోరారు.అలాగే పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచాలని, వైద్య సేవలు మరింత అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు.వినతిపత్రంపై స్పందించిన తిరుపతి డీఆర్ఓ జి. నరసింహులు మహిళా వైద్యులను తక్షణమే నియమించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆసుపత్రికి సంబంధించిన ఇతర సమస్యలను కూడా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కే. గంగాధరం, వి. శ్రీనివాసులు, పి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీని నెరవేర్చిన జిల్లా కలెక్టర్

- పల్లె వీక్షణ కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు మహిళా వ్యాపారవేత్తకు రూ.80 వేల ఆర్థిక సహాయం
- ఒక చిన్న ఆలోచనకు ప్రోత్సాహం.. ఒక కుటుంబానికి ఆర్థిక భరోసా

**నెల్లూరు, పెన్ పవర్ ఆగస్టు 17.**

ఒక చిన్న ఆలోచనకు ప్రభుత్వ ప్రోత్సాహం తోడైతే.. అది ఒక కుటుంబానికి ఆర్థిక భరోసాగా మారుతుంది. ప్రజల సమస్యలను తెలుసుకోవడమే కాకుండా, వారి ఆశయాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న "పల్లె వీక్షణ" కార్యక్రమం ఇందుకు మరోసారి నిదర్శనంగా నిలిచింది.

నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ముత్తుకూరు మండలం పిడతాపోలూరు పంచాయతీ జంగాలకండ్రిగ గ్రామానికి చెందిన ఎద్దుల కళ్యాణికి రూ.80 వేల ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. పల్లె వీక్షణ కార్యక్రమంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ జిల్లా కలెక్టర్ ఈ ఆర్థిక సహాయాన్ని అందించారు.జిల్లా కలెక్టర్ మానసపుత్రికగా నిర్వహిస్తున్న "పల్లె వీక్షణ కార్యక్రమంలో భాగంగా 2026 జూన్ 19న ముత్తుకూరు మండలం పిడతాపోలూరు పంచాయతీ జంగాలకండ్రిగ గ్రామాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా భ్రమరాంబిక సంఘ సభ్యురాలు ఎద్దుల కళ్యాణి ఏర్పాటు చేసిన కంపోస్ట్ ఎరువు తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ యూనిట్‌లో రైతుల వద్ద నుంచి పశువుల పేడను కొనుగోలు చేసి, దానిని కంపోస్ట్‌గా మార్చి, అందులో వేపపిండిని కలిపి నాణ్యమైన కంపోస్ట్ ఎరువును రైతులకు అందిస్తున్నారు. అదేవిధంగా అరటి, మామిడి పండ్ల వ్యాపారం కూడా నిర్వహిస్తున్నారు. కళ్యాణి చేస్తున్న కృషిని, రైతులకు అందిస్తున్న నాణ్యమైన ఎరువును, ఆమె నిర్వహిస్తున్న వ్యాపార కార్యకలాపాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సంతోషం వ్యక్తం చేసి అభినందించారు.ఈ సందర్భంగా కళ్యాణి, ఆమె భర్త తమ వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు వేపకాయల పొడి తయారు చేసే యంత్రాన్ని కొనుగోలు చేయడానికి ఆర్థిక సహాయం అందించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఎంత మొత్తం అవసరమని కలెక్టర్ అడగగా రూ.80 వేల వరకు అవసరమని వారు తెలిపారు. దీంతో జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, తన సొంత నిధుల నుంచి రూ.80 వేల ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు.ఇచ్చిన మాటకు కట్టుబడి, పల్లె వీక్షణ కార్యక్రమంలో ఇచ్చిన హామీని నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కార్యరూపంలోకి తీసుకువచ్చారు. రూ.80 వేల చెక్కును స్వయంగా కళ్యాణికి అందజేసి, మాట ఇచ్చి నిలబెట్టుకునే నాయకత్వానికి, ప్రజల ఆశయాలకు అండగా నిలిచే పరిపాలనకు కలెక్టర్ హిమాన్షు శుక్ల నిదర్శనంగా నిలిచారు.ప్రజా సమస్యలను కేవలం వినడంతోనే పరిమితం కాకుండా, వాటికి పరిష్కారం చూపడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల్లో ఉన్న ప్రతిభను, ఆలోచనలను, చిన్నతరహా వ్యాపారాలను గుర్తించి ప్రోత్సహించడం "పల్లె వీక్షణ"



కార్యక్రమం ప్రత్యేకత. ఒక మహిళ తనకు తానుగా ఉపాధి కల్పించుకోవడమే కాకుండా, రైతులకు ఉపయోగపడే కంపోస్ట్ ఎరువును తయారు చేస్తూ, తన వ్యాపారాన్ని విస్తరించాలనే ఆలోచనతో ముందుకు రావడాన్ని జిల్లా కలెక్టర్ ప్రోత్సహించడం మహిళా సాధికారతకు మరింత ఊతమిచ్చింది.ఈ ఆర్థిక సహాయం అందుకోవడం పట్ల కళ్యాణి ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. పల్లె వీక్షణలో తన సమస్యను విని, తాను కోరిన సహాయానికి సానుకూలంగా స్పందించడమే కాకుండా, ఇచ్చిన హామీని కూడా నిలబెట్టుకుని రూ.80 వేల ఆర్థిక సహాయం అందించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజకుమారి పాల్గొన్నారు.

# 16400 టీచర్ ఉద్యోగాల భర్తీ నారా లోకేష్ బ్రాండ్

- గతంలో పంచాయతీ రాజ్ మంత్రిగానూ ఎల్ఈడీ లైట్లతో ట్రెండ్ సృష్టించారు
- రాజకీయ లబ్ధి కోసమే డీఎస్సీ లో అక్రమాలంటూ వైసీపీ హడావుడి

**నెల్లూరు పెన్ పవర్ ఆగస్టు 17.**

డీఎస్సీ పేరుతో చేపట్టిన దీక్షా శిబిరాల్లో జెన్ జీలు కనిపించలేదు..ఎక్కడ చూసినా జెన్ ఎఫ్(ఫాదర్లు), జెన్ జీఎఫ్(గ్రాండ్ ఫాదర్)లేతాతలు, తండ్రులతో దీక్షలు చేసి అభాసుపాలయ్యారు...మొత్తంగా వైసీపీ భ్రష్టుపట్టిపోయిందిఅసెంబ్లీలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిఈ రోజు అసెంబ్లీ నారా లోకేష్ బాబు స్పీచ్ విన్నాక రోజూ నోరు పారేసుకునే వాళ్ల ఫ్యాంట్లు తడిచిపోయివుంటాయివిద్యా శాఖ మంత్రిగా 16400 పోస్టులతో డీఎస్సీ విజయవంతంగా నిర్వహించి లోకేష్ బాబు బ్రాండ్ క్రియేట్ చేసుకున్నారువేలాదిగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మళ్లీ మరో నోటిఫికేషన్ ఇవ్వబోతున్నారుగత టీడీపీ ప్రభుత్వంలోనూ పంచాయతీ రాజ్ మంత్రిగానూ రాష్ట్ర వ్యాప్తంగా పల్లెల్లో వీధిదీపాలుగా ఎల్ఈడీ లైట్లు వేయించారుఅప్పటి వరకు పది రోజులకే కాలిపోయే లైట్లు, చీకట్లో మగ్గే పరిస్థితుల నుంచి ప్రతి ఊరిలో ఎల్ఈడీ వెలుగులు నింపి ట్రెండ్ తెచ్చారుఇప్పుడు ఐటీ



శాఖ మంత్రిగానూ విదేశాల్లో సైతం తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు..లోకేష్ బాబు చురుకుదనం, పట్టుదల, సబ్జెక్టు చూసి కేంద్ర మంత్రులతో సమానంగా ప్రాధాన్యం పొందడం కూడా ఒక బ్రాండ్ సృష్టించుకోవడమేమా జిల్లాలోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభించినందుకు ధన్యవాదములుగొలగమూడిలోని బీసీ గురుకులంలోనూ జూనియర్ కళాశాల మంజూరు చేసినందుకు లోకేష్ బాబుతో పాటు సవితమ్మకు కూడా ప్రత్యేక కృతజ్ఞతలుడీఎస్సీ ద్వారా మా జిల్లాలో ఓ యువతికి ఉద్యోగం వచ్చింది..ఆ వెంటనే ఆమె పెళ్లి చేసుకుని ఓ బిడ్డకు తల్లి అయ్యారుఇప్పుడు ఆ డీఎస్సీలో అక్రమాలంటూ వైసీపీ నేతలు రాజకీయ లబ్ధి కోసం హడావుడి చేస్తున్నారునేను ఇటీవల నెల్లూరు నుంచి మనుబోలుకు వెళ్లే క్రమంలో మార్గమధ్యలో మూడు వైసీపీ దీక్షా శిబిరాలు చూశానుఢిల్లీలో మాదిరిగా ఈ శిబిరాల్లోనూ జెన్ జీలు ఉంటారని నేను భావించాను...కానీ వాళ్లు ఎక్కడా లేరునెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, సర్వేపల్లిలోని శిబిరాల్లో ఎక్కడ చూసినా జెన్ జీఎఫ్ (గ్రాండ్ ఫాదర్)లే..ఒక్కరు కూడా 90 కేజీలకు, 120 కేజీలకు తక్కువ లేరుప్రతి శిబిరంలోనూ తండ్రులు, తాతలే కనిపించారు...అవ్వలు మాత్రం కనిపించలేదుడీఎస్సీ పేరుతో వైసీపీ చేసిన డ్రామాలన్నీ అట్టర్ ఫ్లాఫ్ అయ్యాయి..అదే సమయంలో డీఎస్సీ ఉపాధ్యాయులు చేసిన ర్యాలీలు విజయవంతంగా జరుగుతున్నాయిమొత్తం మీద వైసీపీ భ్రష్టుపోయినట్టు స్పష్టంగా కనిపిస్తోంది2012లో ఏపీకి చెందిన ఒక నాయకుడిపై 43 వేల కోట్ల రూపాయలు అక్రమ ఆస్తులున్నాయని సీబీఐ కేసు పెట్టింది15వ సంవత్సరాల క్రితం నమోదైన ఆ కేసులో విచారణ ఎలా జరుగుతుందోనని అందరిలో ఆసక్తి ఉందిప్రజల సొత్తు 43 వేల కోట్లు తినేసిన నిందితుడు ఎలాంటి వాదన వినిపిస్తారో, సీబీఐ ఏమి చెబుతుందోనని ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు

# 40 సార్లు అర్జీ ఇచ్చినా భూ సమస్య పరిష్కారం కాలేదా?

## ప్రొసీడింగ్స్ మంజూరు చేయకపోతే భూ బాధితులతో కలిసి ఆందోళన : సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

**తిరుపతి, పెన్ పవర్ ఆగస్టు 17 :**

ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ వేదికగా నిలుస్తుందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఒకే భూ సమస్యపై సుమారు 40 సార్లు అర్జీలు సమర్పించినా పరిష్కారం కాకపోవడం విచారకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని శెట్టిపల్లిలో ల్యాండ్ పూలింగ్ ద్వారా ప్రభుత్వం భూములు తీసుకున్నప్పటికీ, అర్హులైన లబ్ధిదారులకు వారి వాటా భూమికి సంబంధించిన ప్రొసీడింగ్స్ మంజూరు చేయడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని ఆరోపించారు.సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా భూ బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ.. ఈ సమస్యను ఇప్పటికే జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు పలువురు రెవెన్యూ అధికారుల దృష్టికి సుమారు 40 సార్లు తీసుకెళ్లినా ఇప్పటివరకు పరిష్కారం లభించలేదన్నారు. ప్రజలు పదేపదే అధికారుల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా, అర్జీ అందిన వెంటనే సమస్యను పరిశీలించి పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.సుబ్బమ్మ,





గురునాథం, లక్ష్మయ్య, గురవ తదితరులకు సంబంధించిన భూముల విషయంలో 2019 ఫిబ్రవరి 15న తిరుపతి అర్బన్ మండల తహసీల్దార్ వెంకటరమణ అర్హులుగా గుర్తించి, వారికి ప్రొసీడింగ్స్ మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌కు సిఫారసు చేసినట్లు తెలిపారు. జీవో నంబర్ 173 ప్రకారం అర్హులైన అనుభవదారులకు ప్రొసీడింగ్స్ జారీ చేయాల్సి ఉన్నప్పటికీ, ఇంతకాలం గడిచినా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారానికే పీజీఆర్ఎస్ వేదికను ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి చెబుతున్నారని, అయితే ఒకే సమస్యపై 40 సార్లు అర్జీలు ఇచ్చినా పరిష్కారం కాకపోవడం పీజీఆర్ఎస్ పనితీరుపై ప్రశ్నలు తలెత్తేలా చేస్తోందని నాగరాజు విమర్శించారు.జిల్లా స్థాయి అధికారి ఒకరు కోర్టును ఆశ్రయించాల్సిన అవసరం లేదని చెబుతుండగా, డివిజన్ స్థాయి అధికారి మాత్రం కోర్టును ఆశ్రయించి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించడంతో బాధిత కుటుంబాలు దిక్కుతోచని పరిస్థితిలో సీపీఎంను ఆశ్రయించాయని తెలిపారు.

ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అర్హులైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ మంజూరు చేసి సమస్యను పరిష్కరించాలని నాగరాజు డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకుండా మరింత జాప్యం చేస్తే భూ బాధితులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి భారీ ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దాసరి జనార్ధన్, నగర కార్యదర్శి కే. వేణుగోపాల్, భూ బాధితులు పాల్గొన్నారు.

# పేరూరుచెర్లోపల్లి రహదారికి వెలుగులు ఎప్పుడు?

- వీధి దీపాలు లేక వాహనదారుల అవస్థలు..
- పశువుల సంచారంతో పెరుగుతున్న ప్రమాదాలు
- తక్షణమే సెంట్రల్ లైట్లు ఏర్పాటు చేయాలని ఆర్డీఓకు సీపీఎం వినతి

**తిరుపతి, పెన్ పవర్ ఆగస్టు 17 :**

తిరుపతి రూరల్ మండల పరిధిలోని పేరూరు బస్టాప్ నుంచి చెర్లోపల్లి జంక్షన్ వరకు ఉన్న ప్రధాన రహదారి రాత్రివేళల్లో చీకటిమయంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారుతోందని సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మార్గంలో తక్షణమే సెంట్రల్ వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతూ తిరుపతి రెవెన్యూ డివిజన్ అధికారికి సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్. జయచంద్ర, తిరుపతి రూరల్ కార్యదర్శి కే. సుమన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పేరూరు బస్టాప్ నుంచి చెర్లోపల్లి జంక్షన్ వరకు రహదారి మధ్యలోని డివైడర్లపై వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో పూర్తిగా చీకటి అలుముకుంటోందని వారు పేర్కొన్నారు.బెంగళూరు వైపు నుంచి చంద్రగిరి మీదుగా తిరుపతికి వచ్చే వాహనాలతో పాటు, తిరుపతి నగరంలో విధులు ముగించుకుని రాత్రివేళ రూరల్ ప్రాంతంలోని గ్రామాలకు వెళ్లే వేలాది మంది ఈ మార్గాన్ని వినియోగిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా అగ్రికల్చర్ కళాశాల మీదుగా తాటితోపు మార్గం ద్వారా గ్రామాలకు వెళ్లే ప్రజలు చీకటి కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.అగ్రికల్చర్ కళాశాల క్యాంపస్ వరకు డివైడర్లపై వీధి దీపాలు ఏర్పాటు చేశారని, అక్కడి నుంచి పేరూరుచెర్లోపల్లి వైపు సుమారు రెండు కిలోమీటర్ల మేర మరో 31 సెంట్రల్ వీధి దీపాలు ఏర్పాటు చేస్తే వేలాది మంది ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని సీపీఎం నాయకులు తెలిపారు.

**చీకటికి తోడు పశువుల సంచారం**

వీధి దీపాలు లేకపోవడంతో ఇప్పటికే ప్రమాదకరంగా మారిన



రహదారిపై పశువుల సంచారం మరింత ఆందోళన కలిగిస్తోందని వారు తెలిపారు. పేరూరు గ్రామ పరిసరాల నుంచి ఆవులు, గేదెలు, మేకలను గుంపులుగా రోడ్డుపైకి తీసుకురావడం వల్ల వాహనదారులకు ప్రమాదం పొంచి ఉందన్నారు.చీకట్లో పశువులు డివైడర్ల మధ్య నుంచి అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడం, రహదారి దాటడం వల్ల వాహనదారులు వాటిని ముందుగా గుర్తించలేకపోతున్నారని పేర్కొన్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఇతర వాహనాలు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొందన్నారు. పశువుల సంచారాన్ని నియంత్రించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

**టీటీడీ, అధికారులు స్పందించాలి**

అగ్రికల్చర్ కళాశాల క్యాంపస్ వరకు టీటీడీ ఆధ్వర్యంలో డివైడర్లపై వీధి దీపాలు ఏర్పాటు చేసిన నేపథ్యంలో, మిగిలిన సుమారు రెండు కిలోమీటర్ల మార్గంలో కూడా టీటీడీ, జిల్లా యంత్రాంగం లేదా సంబంధిత ప్రభుత్వ శాఖలు సమన్వయంతో సెంట్రల్ వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు కోరారు.పేరూరుచెర్లోపల్లి రహదారి స్థానిక ప్రజల రాకపోకలకే కాకుండా తిరుపతిచంద్రగిరి ప్రాంతాల మధ్య ప్రయాణించే ప్రజలకు కూడా కీలకమైనదని తెలిపారు. రాత్రివేళ వేలాది మంది ప్రయాణించే రహదారిపై కనీస వెలుతురు కల్పించడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత అన్నారు.రహదారిపై వెంటనే సెంట్రల్ వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు పశువుల సంచారాన్ని నియంత్రించాలని, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, ఇతర భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని సీపీఎం తిరుపతి రూరల్ కార్యదర్శి కే. సుమన్ హెచ్చరించారు.

# ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

## పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ హిమన్షు శుక్లా సమీక్ష



**నెల్లూరు, పెన్ పవర్ ఆగస్టు 17 :**

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించడంతో పాటు, అవే సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపడంపై ప్రత్యేక దృష్టి సారించాలని నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమన్షు శుక్లా అధికారులను ఆదేశించారు.

సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో వివిధ మండలాల ప్రజలు సమర్పించిన అర్జీలను కలెక్టర్ అర్జీదారుల సమక్షంలో సంబంధిత అధికారులతో కలిసి సమీక్షించారు. ఒక్కో అర్జీని పరిశీలించి, సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

అర్జీలు తిరిగి రీ-ఓపెన్ కాకుండా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ సూచించారు. ఇందుకోసం అర్జీదారులతో అధికారులు నేరుగా మాట్లాడి, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకుని చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రజల సమస్యలను కేవలం అర్జీ పరిష్కారంగా మాత్రమే చూడకుండా, వాటి మూలకారణాలను గుర్తించి పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్జీదారుడికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ సమీక్షలో కావలి, నెల్లూరు ఆర్డీవోలు ఎలీషా, అనూష, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ నాగశేఖర్‌తో పాటు సుమారు 30 మంది అర్జీదారులు, వివిధ శాఖల అధికారులు, మండలాల సర్వేయర్లు, పోలీసు శాఖకు చెందిన సీఐలు, ఎస్‌హెచ్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ పై అవగాహన అంబటి వెంకటేశ్వర్లు



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 17.**

బుచ్చిరెడ్డిపాలెం తాసిల్దార్ అంబటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ లో భాగంగా ఈ యొక్క నోటీస్ ఏదైతే జనరేట్ చేశామో, దాంట్లో హియరింగ్‌లో భాగంగా ఈరోజు మనం ఈ యొక్క యర్రబాలెం పంచాయతీలోని పల్లాపోలు గ్రామంలో చేయడం జరిగింది ప్రధానంగా ఏందంటే మనకి వీటిల్లో రెండు రకాలుగా మనం చేస్తూ ఉంటాం.నో మ్యాపింగ్ (నో లింకేజీ విత్ ఎస్ ఐ ఆర్ ) ఒకటి.లాజికల్ డిస్క్రిపెన్సీస్ ఏవైతే ఉన్నాయో వాటిని చేస్తూ ఉంటాం ఈ నో మ్యాపింగ్ అంటే ఏంటి అంటే... గత ఎస్ ఐ ఆర్ లో వాళ్ళ యొక్క ఓటు హక్కు లేకుండా ఉండి, ఇప్పుడు వాళ్ళకి ఓటు హక్కు ఉంటే దాన్ని నో మ్యాపింగ్ కింద మనం ఆల్రెడీ చేశాము. అవన్నీ ఇప్పుడు వాళ్ళు ఆ యొక్క డాక్యుమెంట్స్ ఏవైనా ప్రూఫ్స్ తీసుకొచ్చి చూపిస్తే చేస్తాం.అదేవిధంగా లాజికల్ డిస్క్రిపెన్సీస్ అంటే... వాళ్ళ యొక్క గత ఎస్ ఐ ఆర్ లో ఉన్న ఓటర్‌కి ఇప్పుడు ఉన్నదానికి వాళ్ళ పేరు గాని, వాళ్ళ తండ్రి పేరు గాని లేకపోతే ఈ యొక్క వాళ్ళ వయస్సు గాని తేడాలు ఉంటే వాళ్ళు ఇప్పుడు మనకి మళ్ళీ ప్రూఫ్‌లు గాని తీసుకొచ్చి చూపిస్తే వాళ్ళందరికీ కూడా ఓటు ఇవ్వడం జరుగుతుంది.ఇది దాదాపు ఇప్పటికే ఒక 7 పిఎస్ లలో కంప్లీట్ చేయడం జరిగింది. మన బుచ్చిరెడ్డిపాళెం మండలంలో దాదాపు రూరల్‌కి సంబంధించి 35 పిఎస్ లలో ఈ కార్యక్రమం కంటిన్యూస్‌గా ప్రతిరోజు జరుగుతూనే ఉంటుంది అన్నమాట.కాబట్టి నేను దయచేసి ఈ యొక్క నోటీసులు ఎవరైతే తీసుకున్నారో ఆ యొక్క ఓటర్లందరికీ నా యొక్క విజ్ఞప్తి ఏందంటే... మీకు ఎంత ఇంపార్టెంట్ వర్క్ ఉన్నా కనీసం ఆ ఒక్కరోజు, ఇక్కడ దాదాపు మీరు ఎంత ఒక రెండు గంటల సమయం కేటాయిస్తే చాలు. ఆ సమయం కేటాయించి మీ దగ్గర ఉన్న డాక్యుమెంట్లు గాని తీసుకొని వస్తే, మీ అందరికీ కూడా మళ్ళీ మేము ఓటు ఇవ్వడం జరుగుతుంది.కాబట్టి మీ అందరూ కూడా ఎవరైతే నోటీసులు తీసుకున్నారో వాళ్ళు గాని, మీ పక్కింటి వాళ్ళకి గాని, మీ బంధువులు, స్నేహితులు, పక్క గ్రామాల్లో లేకపోతే పక్క పట్టణాల్లో ఉన్న వాళ్ళందరికీ కూడా తెలియజేయండి. ఆ నోటీస్ తేదీఏదైతే హియరింగ్ డేట్ మేము ఇచ్చి ఉంటామో ఆ రోజు మీరందరూ కూడా తప్పనిసరిగా హాజరు కావాలి.ఒకసారి హియరింగ్ డేట్ ఇస్తాము, తర్వాత రెండోసారి కూడా ఇచ్చి చూస్తాము. రెండోసారి కూడా ఆబ్సెంట్ అయితే తర్వాత ఆ ఓటుని వాళ్ళు లేరని భావించి తొలగించబడుతుంది. కాబట్టి దయచేసి మీ అందరికీ తెలియజేసేది ఏందంటే... అందరూ కూడా ఈ కార్యక్రమానికి హాజరై దీన్ని సద్వినియోగం చేసుకొని మీ యొక్క ఓటుని మరలా కూడా నమోదు చేసుకోవాలని మీ అందరికీ తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆర్ ఐ శాంతి ప్రియ వీఆర్వోలు పాల్గొన్నారు

# ఘనంగా ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## వైద్య శిబిరాల్లో 500 మందికి పరీక్షలు.. యూనియన్ సభ్యుడికి రూ.10 వేల ఆర్థిక సాయం







**రాజవొమ్మంగి, పెన్ పవర్, ఆగస్టు 17:**

రాజవొమ్మంగి మండల కేంద్రంలోని మల్లిరెడ్డి గోవింద్ ఫంక్షన్ హాల్‌లో ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలవరం జిల్లా ఏపీయూడబ్ల్యూజే నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడకు చెందిన డాక్టర్ అగర్వాల్ కంటి వైద్యశాల, శ్రీరమా దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. అలాగే రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాల్లో సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య పరీక్షలకు వచ్చిన వారికి మధ్యాహ్న భోజన వసతి కూడా కల్పించారు.యూనియన్ సభ్యుడు నీలాద్రి సతీష్‌బాబు ఇటీవల అనారోగ్యానికి గురైన నేపథ్యంలో ఏపీయూడబ్ల్యూజే తరపున రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా రాజవొమ్మంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు ఉదయం రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు మధ్య జర్నలిస్టులు వారధులుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు.అనంతరం స్థానిక ఏపీయూడబ్ల్యూజే సభ్యులు ప్రజాప్రతినిధులు, అధికారులు, యూనియన్ నాయకులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో పోలవరం జిల్లా ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఎం. చంద్రశేఖర్, కార్యదర్శి సత్యనారాయణమూర్తి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు అడపా వీరబాబు, బాల నారాయణ, పరిటాల వెంకట్, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, సీఐ ఎన్. సన్యాసినాయుడు, ఎస్ఐ వెంకట్రావు, జీసీసీ మేనేజర్ బేబీరాణి, అటవీ అధికారి ఉషారాణి, వైద్యాధికారిణి పావని, మండల అల్లూరి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఆరిపాక సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే పోలవరం జిల్లాలోని పదకొండు మండలాలకు చెందిన ఏపీయూడబ్ల్యూజే జర్నలిస్టులు, యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం




**గుంటూరు:పెన్ పవర్ ఆగస్ట్, 17,**

నానాటికీ పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు, వ్యవస్థను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత రాజ్యాంగంలోని నాలుగో స్తంభమైన పాత్రికేయ రంగంపై ఉందని ఇస్రో, నాసా విశ్రాంత శాస్త్రవేత్త, మేధావి చందు సాంబశివరావు అన్నారు. ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ, సదస్సు నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ నుంచి సంఘం జెండాలతో ద్విచక్ర వాహనాలపై భారీ ర్యాలీ నిర్వహించి అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకున్నారు. అనంతరం కళాశాల సమావేశ మందిరంలో 'సోషల్ మీడియా ప్రభావం--సైబర్ నేరాలు-ఏఐ టెక్నాలజీ' అంశంపై సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న చందు సాంబశివరావు మాట్లాడుతూ.. జెన్సీ కాలంలో సైబర్ నేరాలను అరికట్టేందుకు కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను విస్తృతంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో జర్నలిజం ప్రాధాన్యంపై సరైన అవగాహన లేకపోవడం, పారిశ్రామికవేత్తల చేతుల్లో జర్నలిజం బందీ కావడం బాధాకరమన్నారు. పాత్రికేయ వృత్తికి రక్షణ, గౌరవం కల్పించాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలపై ఉందన్నారు. ఎనిమిది దశాబ్దాల భారత ప్రజాస్వామ్యంలో 24 గంటలు శ్రమిస్తూ విధులు నిర్వహిస్తున్న విలేకరులకు కనీస వేతన చట్టాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పత్రికా యాజమాన్యాలు విఫలమయ్యాయని అన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ఫేక్ అకౌంట్లను ఉపయోగించే వారిని కట్టడి చేసేలా జర్నలిస్టులు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ కె. జ్యోతిర్మయి మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణలో భారత్ 150వ స్థానంలో ఉండటం బాధాకరమన్నారు. సోషల్ మీడియా సైబర్ సెల్ పోలీసు అధికారి కిషోర్ మాట్లాడుతూ క్లిష్టమైన సైబర్ నేరాల దర్యాప్తు, నియంత్రణలో ఏఐ సాంకేతికత ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. విద్యార్థులు, యువత నకిలీ సోషల్ మీడియా ఖాతాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుంటూరు నగర అధ్యక్ష కార్యదర్శులు కొంగర వెంకయ్య, కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులపై జరిగే అన్ని రకాల దాడులను సంఘటితంగా ఎదుర్కొనేందుకు ఏపీయూడబ్ల్యూజే కృషి చేస్తోందన్నారు. వర్కింగ్ జర్నలిస్టులకు రూ.25 లక్షల కుటుంబ ఆరోగ్య బీమా, ఇళ్ల నిర్మాణానికి సదుపాయాలు, ఉచిత రైల్వే పాసులు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు మల్లిఖార్జునరావు, విరణ్ జ్యోతి, గిరిధర్, వెంకటేశ్వరావు తదితరులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆవిర్భావ దినోత్సవ కేక్ కట్ చేశారు.




ఈ కార్యక్రమంలో హిందూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ సుబ్బారావు, హిందూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగభూషణం, డాక్టర్ సీతారామయ్య, డాక్టర్ సుస్మిత, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సేవకుమార్, పూర్వ ఐజేయూ సభ్యులు ఆది గిరిధర్, యూనియన్ రాష్ట్ర నాయకులు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు నాగుల్ మీరా, రాష్ట్ర నాయకులు పులివర్తి శ్రీనివాసరావు, భక్తవత్సలరావు, జిల్లా కార్యదర్శి రాంబాబు, సామ్నా జిల్లా అధ్యక్షకార్యదర్శులు రఘువీరారెడ్డి, చెరుకూరి శ్రీనివాసరావు, ఏపీయూడబ్ల్యూజే, సామ్నా ప్రతినిధులు వీఎల్ నరసింహారావు, తిరుపతిరెడ్డి, వెంకటేశ్వరరావు, ఆళ్ల వీరభద్రరావు, లూర్దురాజు, పచ్చవ పరశురామ్, సుజిబాబు, పరశ్యామ్, అప్పారావు, రామ్ భాస్కర్, సుబ్బారావు, శ్రీనాధ్, కోటి, మణి, మామిడాల శ్రీనివాసరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్కేటింగ్‌లో విజయవాడ చిన్నారుల ప్రతిభ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

**విజయవాడ,పెన్ పవర్,ఆగస్టు 17:**

జోనల్, రీజనల్ స్థాయి స్కేటింగ్ పోటీల్లో విజయవాడకు చెందిన చిన్నారులు నడికట్ల బ్లెస్సన్ ఆనంద్, నడికట్ల ఘనత ఆనంద్ అద్భుత ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశను కలిసి తమ విజయాలను వివరించగా, కలెక్టర్ వారిని ప్రత్యేకంగా అభినందించారు.అండర్11 బాలుర విభాగంలో బ్లెస్సన్ ఆనంద్ రెండు బంగారు, ఒక రజత పతకం సాధించగా, అండర్14 బాలికల విభాగంలో ఘనత ఆనంద్ మూడు బంగారు, ఒక రజత పతకాలు సాధించారు.రీజనల్ స్థాయి పోటీల్లో అండర్14



విభాగంలో బంగారు పతకం సాధించిన ఘనత ఆనంద్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబర్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె పాల్గొననున్నారు.చిన్న వయస్సులోనే క్రీడలపై ఆసక్తి పెంచుకుని క్రమశిక్షణతో సాధన చేసి పతకాలు సాధించడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. నిరంతర సాధనతో భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో చిన్నారుల తండ్రి నడికట్ల డేనియల్ ఆనంద్, కోచ్ ఎస్.కె. పవన్ కుమార్ పాల్గొన్నారు.

# ఉత్తమ ఉద్యోగిగా తహసిల్దార్ సలీమాకు అభినందనలు

**బాపట్ల:( పెన్ పవర్), ఆగస్టు17**

బాపట్ల పంద్రాగస్టు వేడుకల్లో ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసా పత్రం, షీల్డ్ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పి ఉమామహేశ్వర్ చేతుల మీదగా అందుకున్న తహసిల్దార్ సలీమాను సహచర శాఖల అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. వృత్తిపట్ల నిబద్ధతతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం దగ్గుబాటి సురేష్, మండల వ్యవసాయ అధికారి




శారద, సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ ఫణికుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

**ప్రజా సమస్యల స్వీకరణ**

బాపట్ల తహసిల్దార్ సలీమా అధ్యక్షతన మండల స్థాయిలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుంచి సమస్యలు, వినతులను స్వీకరించారు. ప్రజలు అందించిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ సలీమా అధికారులకు సూచించారు.

# బాపట్లలో విగ్రహాల చుట్టూ వేడెక్కుతున్న రాజకీయాలు

**బాపట్ల:( పెన్ పవర్ ), ఆగస్టు17**

బాపట్లలో మహనీయుల విగ్రహాల ఏర్పాటు, పునఃప్రతిష్ఠాపన అంశాలు రాజకీయ వివాదాలకు దారితీస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రోడ్ల విస్తరణలో భాగంగా డివైడర్లపై ఉన్న పలు విగ్రహాలను తొలగించగా, వాటిని తిరిగి ఏర్పాటు చేయడం ఆలస్యమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఒక్కొక్కటిగా విగ్రహాలను పునఃప్రతిష్ఠిస్తున్నారు.పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు సందర్భంగా శిలాఫలకంపై అప్పటి ఆర్యవైశ్య సంఘం నాయకుల పేర్లు లేకపోవడంపై అభ్యంతరాలు వ్యక్తం కాగా, సమస్యకు ప్రత్యామ్నాయ మార్గంలో పరిష్కారం చూపారు. మాజీ గవర్నర్, బాపట్ల మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు కోన ప్రభాకరరావు విగ్రహ ఏర్పాటు విషయంలోనూ రాజకీయ చర్చలు చోటుచేసుకున్నాయి.మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు ఎటువంటి అభ్యంతరాలు ఉండవని, వారిని గౌరవించుకోవడం అందరి బాధ్యత అని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు స్పష్టం చేశారు. వారి జయంతి, వర్ధంతి సందర్భాలను పురస్కరించుకుని ఒక్కొక్క విగ్రహాన్ని పునఃప్రతిష్ఠిస్తున్నట్లు తెలిపారు.అయితే పాత శిలాఫలకాలను యథావిధిగా ఏర్పాటు చేయాలని, తమ పేర్లు ఉండాలని కొందరు డిమాండ్లు చేస్తూ నిరసనలు చేపడుతున్నారు. దీంతో బాపట్లలో విగ్రహాల ఏర్పాటు అంశం రాజకీయ వివాదంగా మారుతోందన్న చర్చ జరుగుతోంది.మహనీయుల ఆశయాలు, సేవలను స్మరించుకోవడమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని, విగ్రహాల ఏర్పాటును వ్యక్తిగత పేర్లు, ప్రోటోకాల్ వివాదాలకు వేదికగా మార్చకూడదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# పేదవాడి ఆపద్బాంధవుడు 'అఖండ ఫౌండేషన్

- దయాలసిస్ బాధితునికి ఆర్థిక సాయం అందజేత!
- మా దృష్టికి వచ్చిన ప్రతి బాధితుడికి అండగా నిలిచేందుకు
- ఫౌండేషన్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేసిన
- అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్.

**బాపట్ల,( పెన్ పవర్) ఆగస్టు 17**

సమాజంలో ఎక్కడ ఏ నిరుపేద కుటుంబం అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నా, ఆర్థిక స్థోమత లేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సతమతమవుతున్నా వారికి అండగా నిలవడమే పరమావధిగా అఖండ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న 'అఖండ ఫౌండేషన్' మరోసారి తన గొప్ప మనసును చాటుకుంది. ఆపదలో ఉన్న ఒక నిరుపేద దయాలసిస్ బాధితునికి ఆర్థిక సాయం అందించి, అతనికి పునర్జన్మపై భరోసా కల్పించారు. బాపట్ల కర్లపాలెం మండలం ఎంవీ రాజుపాలెం గ్రామానికి చెందిన శీలం సుబ్బారెడ్డి గత కొంతకాలంగా తీవ్రమైన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. బతకాలంటే క్రమం తప్పకుండా దయాలసిస్ చేయించుకోవాల్సిన దుస్థితి. అయితే పూట గడవడమే కష్టమైన అత్యంత నిరుపేద కుటుంబం కావడంతో, రోజురోజుకూ పెరుగుతున్న వైద్య ఖర్చులను భరించలేక ఆయన కుటుంబం తీవ్ర



నైరాశ్యంలోకి వెళ్లిపోయింది. చేతిలో చిల్లిగవ్వ లేక, వైద్యం చేయించుకునేందుకు మార్గం కనబడక సుబ్బారెడ్డి పడుతున్న యాతన వర్ణనాతీతం. ఈ దీనస్థితి గురించి తెలుసుకున్న అఖండ ఫౌండేషన్ సభ్యులు ఆట్ల హరిబాబు రెడ్డి వెంటనే చొరవ తీసుకున్నారు. బాధితుని దుస్థితిని ఫౌండేషన్ అధ్యక్షుల దృష్టికి తీసుకువెళ్లి, ఎలాగైనా ఆ కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. స్పందించిన అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు వె విన్నకోట సురేష్ తక్షణమే తగిన సహాయం అందజేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. సోమవారం నాడు అఖండ ఫౌండేషన్ ప్రతినిధి ఆట్ల హరిబాబు రెడ్డి స్వయంగా బాధితుని నివాసం వద్దకు వెళ్లి, ఫౌండేషన్ తరఫున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ తక్షణ సాయం సుబ్బారెడ్డి రాబోయే వైద్య ఖర్చులకు ఎంతో ఊరటనిస్తుందని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్ మాట్లాడుతూ.. "కష్టాల్లో ఉన్న తోటి మనిషికి చేయూతనివ్వాలనే ఏకైక మానవతా దృక్పథంతోనే మేము ఈ ఫౌండేషన్‌ను స్థాపించాము. ప్రతి పేదవాడి మోహంలో చిరునవ్వు చూడటమే మా సంస్థ ప్రధాన లక్ష్యం. డబ్బులు లేక వైద్యం అందక ఏ ఒక్క పేదవాడూ ప్రాణాలు కోల్పోకూడదనే ఉద్దేశంతోనే మా వంతు ప్రయత్నం చేస్తున్నాం. మా దృష్టికి వచ్చిన నిరుపేద రోగులకు, ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ మా ఫౌండేషన్ శక్తిమేర ఆర్థిక సాయం అందించేందుకు అన్ని వేళలా ముందుంటుంది" అని భరోసానిచ్చారు. నిరుపేదలకు ఆపద్బాంధవుడిగా మారుతున్న అఖండ ఫౌండేషన్ సేవలను స్థానిక ప్రజలు, హృదయపూర్వకంగా అభినందిస్తున్నారు.

# ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం



**బాపట్ల:( పెన్ పవర్), ఆగస్టు17**

బాపట్ల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పట్టణంలోని రోటరీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.విజయలక్ష్మిపురంలోని రోటరీ కళ్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి శిబిరం కొనసాగుతుందని తెలిపారు. డాక్టర్ నీలిమ ప్రియదర్శిని ఆధ్వర్యంలో ఆక్యుపంక్చర్, డైట్ అండ్ న్యూట్రీషియన్, సుజోక్ థెరపీ తదితర వైద్య సేవలపై శిబిరంలో చికిత్స అందిస్తారని పేర్కొన్నారు. మెడ, వెన్ను, కీళ్ల నొప్పులు, తలనొప్పి, మైగ్రేన్, సయాటికా, ఆర్థ్రైటిస్, ఫ్రోజన్ షోల్డర్, ఒత్తిడి, నిద్రలేమి, జీర్ణ సంబంధ సమస్యలు, రుతుక్రమ అసౌకర్యాలు వంటి సమస్యలకు ఆక్యుపంక్చర్ ద్వారా ఉపశమనం పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు. వైద్య శిబిరానికి ముందస్తు నమోదు, అపాయింట్‌మెంట్ తప్పనిసరని పేర్కొన్నారు.బాపట్ల నియోజకవర్గ ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వేజండ్ల శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, కోశాధికారి కోళ్లపూడి బాలాజీ, మెడికల్ క్యాంపు చైర్మన్ తాళ్లూరి మల్లికార్జునరావు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

# వేటపాలెం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయానికి నూతన కమిటీలు





**వేటపాలెం, పెన్ పవర్, ఆగస్టు 17:**

20262028 సంవత్సరాలకు గాను వేటపాలెం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయానికి సంబంధించిన నాలుగు నూతన కమిటీల పరిచయ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఆలయ కమిటీ అధ్యక్షులుగా మాజేటి వెంకట సుబ్బారావు, కార్యదర్శిగా కోడూరి రామకృష్ణ, కోశాధికారిగా బాపనపల్లి విప్రనారాయణ ఎన్నికయ్యారు. మహిళా సంఘం అధ్యక్షురాలిగా చుండూరి గాయత్రి, కార్యదర్శిగా అమరా సునీత, కోశాధికారిగా పోలిశెట్టి వంశీ ప్రియ బాధ్యతలు చేపట్టారు.వైశ్య సంఘం అధ్యక్షుడిగా పద్మనాభుని వెంకట లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా గొడవర్తి గణేష్, కోశాధికారిగా బాపనపల్లి రూపేశ్వరరావు ఎన్నికయ్యారు. విరూపాక్ష యువజన సంఘం అధ్యక్షులుగా పత్తి పార్థసారధి, కార్యదర్శిగా గొల్లపూడి వినోద్, కోశాధికారిగా అమరా మణికంఠ ఎన్నికయ్యారు. పీఆర్‌ఓగా చుండూరి సురేష్ కొనసాగనున్నారు.నూతనంగా ఎన్నికైన నాలుగు కమిటీల సభ్యులు ఆలయ అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ, వైశ్య సంఘాల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# బుర్లవారిపాలెంలో ఉచిత వైద్య శిబిరం



**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 17 :**

చీరాల మండలం బుర్లవారిపాలెం గ్రామంలో రమేష్ డయాగ్నస్టిక్స్ ఆధ్వర్యంలో రోహిణి ఫార్మా క్లినిక్‌లో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్థులకు షుగర్, బీపీ, రక్త శాతం, గుండెకు సంబంధించిన ఈసీజీ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు.ఈ వైద్య శిబిరానికి గ్రామస్థుల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు 60 నుంచి 70 మంది వరకు హాజరై వివిధ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షల అనంతరం వైద్యులు వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, అవసరమైన సూచనలు, సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యానాదిరావు, బుర్ర అంకయ్య, బొంతకర్ల శ్రీనివాస్, డాక్టర్ భాను తేజ, రమేష్ డయాగ్నస్టిక్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోలకం వారి వివాహ వేడుకలో

## రాజకీయ, సామాజిక సందడి

### వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య



**వేటపాలెం, పెన్ పవర్,ఆగస్టు 17:**

పందిళ్లపల్లికి చెందిన ప్రముఖ టీడీపీ నాయకుడు, నియోజకవర్గ తెలుగు రైతు విభాగం అధ్యక్షుడు పోలకం చంద్రశేఖర్ సోదరుడి కుమార్తె వివాహం సోమవారం కొత్తపేటలోని రావి సుబ్బారాయుడు కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది. చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ముఖ్య అతిథిగా హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, పోలకం చంద్రశేఖర్‌కు సమీప బంధువు కావడంతో వివాహ వేడుకకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, జనసేన నాయకుడు చిలకలపూడి పాపారావు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.ప్రముఖ వైద్యులు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ హరిహరనాథ్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ బాబురావు, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ రామకృష్ణ, హనుమాన్ భారతి కళాశాల డైరెక్టర్ తోట రోశయ్య, గౌతమి విద్యా సంస్థల డైరెక్టర్ ఎం.వి. తదితరులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.వివాహ వేడుకకు జిల్లాస్థాయి నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, జర్నలిస్టులు, చీరాల, వేటపాలెం రోటరీ ప్రతినిధులు, వివిధ శాఖల ఉద్యోగులు, గ్రామస్థులు, బంధువులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.రాజకీయ, సామాజిక, వైద్య, విద్యా రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కల్యాణ మండపంలో సందడి నెలకొంది. వివాహ వేడుకకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికీ పోలకం చంద్రశేఖర్ తన కుటుంబ సభ్యుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.